ప్రజాశక్తి
శనివారం 9 ఆగస్టు, 2025
శ్రీకాకుళం

ఇచ్ఛాపురం తహశీల్దార్‌కు ఛార్జి మెమో

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఇచ్ఛాపురం తహశీల్దార్ ఎన్.వెంకటరావుకి ఛార్జి మెమో జారీ అయింది. ఆయనపై గతంలో ఎసిబి విచారణ ఆధారంగా ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ మెమో జారీ చేశారు. పది రోజుల్లో తనపై వచ్చిన ఆరోపణలపై వివరణ ఇవ్వాలని మెమోలో పేర్కొన్నారు. శ్రీకాకుళం తహశీల్దార్‌గా ఆయన పనిచేసిన సమయంలో తహశీల్దార్‌పై వచ్చిన అవినీతి ఆరోపణలపై అప్పట్లో ఎసిబి దర్యాప్తు చేసింది. రూ.ఐదు వేలు లంచం డిమాండ్ చేసినట్లు బాధితులు ఎసిబిని ఆశ్రయించగా, వారు దర్యాప్తు చేశారు. తహశీల్దార్ ఇచ్చిన వివరణ అనంతరం తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

జిల్లాలో విభిన్న వాతావరణ పరిస్థితులు నెలకొనడంతో అన్నదాతల పరిస్థితి అయోమయంగా మారింది. జిల్లాలో పలుచోట్ల ఒకట్రెండు సార్లు ఒక మోస్తరు వర్షాలు పడడం, తర్వాత రోహిణీ కార్తె తరహాలో ఎండలు మండిపోతున్న పరిస్థితి నెలకొంది. ఖరీఫ్ ప్రారంభమై రెండు నెలలకు పైగా గడుస్తున్నా, పూర్తిస్థాయిలో పంటల సాగు జరగడం లేదు. మూడో నెలలోనూ లోటు వర్షపాతమే నమోదైంది. దీంతో సాగుకు ప్రతికూల పరిస్థితులు నెలకొన్నాయి. సాగునీటి కాలువలు ఉన్నచోట్ల కొంతవరకు పంట పరిస్థితి బాగానే ఉన్నా, వర్షాధార ప్రాంతాల్లో మరింత అధ్వానంగా ఉంది. చెరువులూ ఎండిపోతున్నాయి. జలాశయాల్లో నీటి నిల్వలు అడుగంటుతున్నాయి. మేఘాలు మబ్బులు పట్టి ఊరించడం తప్ప ఆశించిన వర్షాలు కురవకపోవడంతో వేసిన పంటలు దక్కుతాయో, లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

నరసన్నపేట మండలంలో ఎండుతున్న వరి పంట

ముందుకు 'సాగే'దెలా?

- జిల్లాలో ఖరీఫ్ సాగుకు ప్రతికూల వాతావరణ పరిస్థితులు
- వేసవి తలపించేలా ఉష్ణోగ్రతల నమోదు
- ఎండిపోతున్న నారుమళ్లు
- వర్షాధార ప్రాంతంలో పరిస్థితి మరింత అధ్వానం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు అనువైన వర్షం పడలేదు. సీజన్ ప్రారంభమైన జూన్ ఒకటో తేదీ నుంచి శుక్రవారం వరకు సాధారణంగా 358.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవుతుంది. ప్రస్తుతం 261.8 మి.మీ వర్షం మాత్రమే కురిసింది. జిల్లావ్యాప్తంగా 26.9 శాతం లోటు నమోదైంది. జిల్లాలో 30 మండలాలు ఉండగా 19 మండలాల్లో వర్షపాతం లోటు ఉండగా, మెళియాపుట్టి మండలంలో అత్యంత వర్షపాతం లోటు కనిపిస్తోంది. పది మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. జూలైలో లావేరు, రణస్థలం, ఎచ్చెర్ల మండలాల్లో కురవాల్సిన వాన కంటే అదనంగా వర్షం నమోదైనా, ఆగస్టు నెల వచ్చేసరికి అక్కడా లోటు వర్షపాతం నమోదైంది. జూన్‌లో సాధారణంగా 134.9 మి.మీ వర్షం కురవాల్సి ఉండగా, 92 మి.మీ వర్షం మాత్రమే కురిసింది. వర్షపాతం లోటు 31.8 శాతంగా నమోదైంది. ఆగస్టు ఒకటో తేదీ నుంచి శుక్రవారం వరకు 39.1 మి.మీ వర్షం పడాల్సి ఉండగా 19.2 మి.మీ వర్షం కురిసింది.

మందకొడిగా సాగు

జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో మందకొడిగా పంటలు సాగవుతున్నాయి. 2025 ఖరీఫ్‌లో అన్నిరకాల పంటలు కలిపి 4,07,488 ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేస్తారని అంచనా వేయగా, ఇప్పటివరకు 3.21 లక్షల ఎకరాల్లో పంటలు వేయగలిగారు. 3,76,773 ఎకరాల్లో వరి పంట సాగవుతుందని అంచనా వేయగా, ప్రస్తుతం 2.83 లక్షల ఎకరాల్లో సాగవుతోంది. మొక్కజొన్న పంటలను 23,873 ఎకరాల్లో వేయాల్సి ఉండగా 20 వేల ఎకరాల్లో వేశారు. పత్తి పంటను 3,125 ఎకరాల్లో వేస్తారని అంచనా వేయగా, 505 ఎకరాల్లో రైతులు విత్తనాలు వేశారు. చెరుకు పంటను 2,623 ఎకరాల్లో వేస్తారని లక్ష్యంగా నిర్ణయించగా 300 ఎకరాల్లో వేశారు.

రిజర్వాయర్లలో పడిపోతున్న నీటిమట్టం నిల్వలు

వర్షాభావ పరిస్థితులు, అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో జిల్లా ఉన్న రిజర్వాయర్లు, బ్యారేజీల్లో నీటిమట్టం నిల్వలు పడిపోతున్నాయి. ఒడిశాలో కాస్త వర్షాలు పడుతుండడంతో వంశధారలో 2,239 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది. హిరమండలం మండలం గొట్టాబ్యారేజీ పూర్తి సామర్థ్యం 0.66 టిఎంసిలు కాగా, ప్రస్తుతం 0.64 టిఎంసిల నీటి లభ్యత మాత్రమే ఉంది. మడ్డువలస రిజర్వాయర్ సామర్థ్యం 3.37 టిఎంసిలు కాగా, ప్రస్తుతం 2.84 టిఎంసిల నీరు అందుబాటులో ఉంది. తోటపల్లి రిజర్వాయర్ 2.51 టిఎంసిల నీరు లభ్యం కావాల్సి ఉండగా, ప్రస్తుతం 2.12 టిఎంసిల నీరు ఉంది.

ఎండిపోతున్న నారుమళ్లు

వర్షాల్లేక ఒకవైపు, ఎండ వేడిమి ధాటికి పంటలు ఎండిపోతున్నాయి. వేసవిని తలపించేలా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో చాలాచోట్ల భూమి నెర్రలు బారుతోంది. రుతుపవనాలు మేలోనే ప్రవేశించాయన్న వార్తలతో చాలాచోట్ల రైతులు ముందుగానే విత్తనాలు చల్లుకున్నారు. ప్రస్తుతం ఉబాలు జరగాల్సిన సమయంలో వానలు లేకపోవడంతో, పంటను కాపాడుకోవడానికి రైతులు నానా పాట్లు పడుతున్నారు. ఇంజిన్ల సాయంతో నీటిని తోడి పొలాలను తడుపుతున్నారు. కాలువలు ఎండిపోవడంతో దూరంగా ఉన్న చెరువుల్లో నుంచి నీటిని తీసుకొస్తున్నారు. సొంత ఇంజిన్లు ఉన్న రైతులకు ఎకరాకు డీజిల్ కోసం రూ.వెయ్యి వరకు ఖర్చు చేస్తున్నారు. సొంత ఇంజిన్లు లేని వారు డీజిల్ ఖర్చుతో పాటు పైపుల కోసం గంటకు రూ.80 వరకు అద్దె చెల్లిస్తున్నారు.

13న క్విట్ కార్పొరేట్ డే

జయప్రదం చేయాలి : సంయుక్త కిసాన్ మోర్చా

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

వ్యవసాయరంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతున్న మోడీ విధానాలకు నిరసనగా ఈనెల 13న క్విట్ కార్పొరేట్ డేను నిర్వహిస్తున్నట్లు సంయుక్త కిసాన్ మోర్చా, రైతు, కౌలురైతు, కార్మిక, విద్యార్థి, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. క్విట్ కార్పొరేట్ నినాదంతో ట్రాక్టర్, బైక్ ర్యాలీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నగరంలోని సిఐటియు కార్యాలయంలో క్విట్ కార్పొరేట్ డే పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడోసారి అధికారం చేపట్టిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రద్దయిన మూడు నల్ల చట్టాల కన్నా ప్రమాదకరమైన విధానాలను ప్రకటించిందని విమర్శించారు. వ్యవసాయ మార్కెట్ల చట్టాన్ని విదేశీ, స్వదేశీ కంపెనీల ఎగుమతి, దిగుమతి వ్యాపారుల ప్రయోజనాలకు అనుగుణంగా మార్పులు చేసిందన్నారు. ఈ విధానం ప్రకారం పంటలకు మద్దతు ధరల విధానం ఉండదని, ప్రభుత్వ ఏజెన్సీలు కొనుగోలు చేయవని చెప్పారు. రైతులు నేరుగా గానీ ఎఫ్‌పిఒ గ్రూపులుగా గానీ అగ్రిమెంట్ చేసుకుని కంపెనీల నిబంధనల ప్రకారం పంటలు పండించి ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్‌లో ధరల స్థిరీకరణ నిధి ఎత్తివేసిందన్నారు. ఎరువులు, పరికరాలపై సబ్సిడీల కోత విధించిందని, పదేళ్లు దాటిన ట్రాక్టర్లపై నిషేధం విధించిందని, ఎఫ్‌సిఐ తదితర గోడౌన్లన్నీ అదానీకి అప్పగించిందని, ప్రభుత్వ ఏజెన్సీలు కొనడం లేదన్నారు.

రష్యా నుంచి మనకు చౌకగా లభ్యమవుతున్న చమురు నిషేధిస్తే మనం వ్యవసాయంలో ఆయిల్ వినియోగించే స్ప్రేయర్ల నుంచి ట్రాక్టర్లు, కోత యంత్రాల వరకు ఖర్చులు పెరిగిపోతాయన్నారు. మనం ఎగుమతి చేసే వస్తువులపై 50 శాతం సుంకాలు విధిస్తానని ట్రంప్ బెదిరిస్తుంటే, మన ప్రధాని మౌనంగా ఉండడం ప్రమాదం కాదా అని ప్రశ్నించారు. ఈ ఏడాది మనం ఎగుమతి చేయగలిగిన మిరపకాయలు, పొగాకు, మామిడిపళ్లు, పప్పు ధాన్యాలు, శనగలు పంటల ధరలన్నీ పడిపోయాయన్నారు. వ్యాపారులందరూ ఏకమై ధరలు తగ్గించి వేశారని, తాజాగా మనం ఎగుమతి చేసే రొయ్యలు సైతం ధరలు పడిపోయాయని తెలిపారు. మన దేశ అవసరాలకు సరిపడా పండుతున్న వరి, గోధుమ, మొక్కజొన్న పంటలు దిగుమతి చేసుకోవాల్సి వస్తుందన్నారు. మనం మిగులు ఉత్పత్తి కలిగిన పాడి, పాల ఉత్పత్తులు, కోళ్లు, కోడిమాంసం దిగుమతి చేసుకోవాల్సి వస్తుందని, ఆ దేశాల్లో ఇస్తున్న భారీ సబ్సిడీలతో వచ్చి దిగుమతి అవుతాయని తెలిపారు. దీంతో మన రైతాంగం దివాళా తీయడం తప్ప మరో మార్గం ఉండదన్నారు. ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ విరమింపజేయాలని, మన రైతాంగానికి నష్టకరమైన మార్కెట్ చట్టాన్ని రద్దు చేయించాలని, అందుకు సకల రైతాంగాన్ని కదిలించాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మికులు, వత్తిదారులు, కార్మికులు, విద్యార్థి, యువజన, మహిళా సంఘాలను కలుపుకొని పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ట్రేడ్ యూనియన్ల మద్దతుతో న్లు అన్ని మనకు మద్దతు ఇస్తున్నాయని వారి మద్దతు తీసుకుని 13న ట్రాక్టర్, బైక్ ర్యాలీలు నిర్వహించాలన్నారు. ట్రంప్, మోడీ దిష్టిబొమ్మలను దగ్ధం చేయాలన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పలు సంఘాల నాయకులు

ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ విరమించాలని, సి2+50 ప్రకారం పంటల మద్దతు ధరల చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికుల రుణాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పదేళ్లు దాటిన ట్రాక్టర్లపై నిషేధం తొలగించాలని, కార్పొరేట్ కంపెనీలకు పంటలు పండే భూములు ఇవ్వరాదని డిమాండ్ చేశారు. వెనుకబడిన ప్రాంతాల ప్రాధాన్యతా ప్రకారం సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తిచేయాలని, అటవీ హక్కుల చట్టం 1/70 అమలు చేయాలని కోరారు. జీడి పంటకు మద్దతు ధర ప్రకటించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. ప్రీపెయిడ్ విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లోని ఇనుప గనులను విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంయుక్త కిసాన్ మోర్చా కన్వీనర్ తాండ్ర ప్రకాష్, ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి.సింహాచలం, కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి పోలాకి ప్రసాదరావు, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు బొత్స సంతోష్, ఎస్ఎఫ్ఐ నాయకులు డి.చందు, పి.ఖగేష్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమం

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ... అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలోని నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించే దిశగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని వినతులు అందాయి. నూతన ఫించన్లు, నూతన గృహాలు మంజూరు చేయాలని ప్రజల నుంచి పెద్దఎత్తున వినతులు అందుతున్నాయి. త్వరలో మంజూరు చేస్తామని వివరించారు. ప్రజల నుంచి వచ్చిన వినతలు పరిశీలించి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి త్వరితగతిన మేలు చేసేవిధంగా సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విధుల్లో అలసత్వం లేకుంగా అధికారులు పనిచేయాలని సూచించారు.

వినతులు స్వీకరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

12న డీ వార్మింగ్ డే

- జిల్లాలో 4.11 లక్షల మంది పిల్లలకు ఆల్బెండాజోల్ మాత్రల పంపిణీ
- జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి అనిత

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం - పాఠశాల ఆరోగ్య పథకంలో భాగంగా జిల్లాలో ఈ నెల 12న డీవార్మింగ్ డే, ఆగస్టు 20న మాప్ అప్ డే నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ అనిత తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. డీ వార్మింగ్ డే సందర్భంగా జిల్లాలోని 4,11,258 మంది పిల్లలకు ఆల్బెండజోల్ (400 మి.గ్రా.) మాత్రలు అందజేయనున్నట్లు చెప్పారు. జిల్లాలోని 3,296 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న 3,34,723 మంది విద్యార్థులకు, 2,715 మంది స్కూలు వెళ్లని పిల్లలకు, అలాగే 3,358 అంగన్వాడీ కేంద్రాల్లోని 73,820 మంది 1 నుంచి ఐదేళ్ల పిల్లలకు ఈ మాత్రలు అందజేస్తామన్నారు. జిల్లాకు అవసరమైన 5,03,800 ఆల్బెండజోల్ మాత్రలు అందినట్లు తెలిపారు. మండల వారీగా పిహెచ్‌సి. వైద్యాధికారులు, ఎంపిడిఒ, ఎంఇఒ, సిడిపిఒ, సిఆర్‌పి పర్యవేక్షణలో ఈ నెల 8 నాటికి అన్ని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు పంపిణీ పూర్తిచేసినట్లు పేర్కొన్నారు. ప్రతి పాఠశాలలోనూ ఒక ఆరోగ్య సిబ్బందిని పర్యవేక్షకుడిగా నియమించారని తెలిపారు. మధ్యాహ్న భోజనం అనంతరం మాత్రలు వేయనున్నట్లు పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో వయసు ప్రాతిపదికన మాత్ర మోతాదులు నిర్ణయించినట్లు తెలిపారు. ఔషధానికి ఎటువంటి దుష్ప్రభావాలు ఉండవని, ఒకవేళ ఉంటే వెంటనే సమీప పిహెచ్‌సిని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య, విద్య, అంగన్వాడీశాఖల సమన్వయం, ఆశా కార్యకర్తలు, స్వచ్ఛంద సేవా సంఘాల సహకారంతో విజయవంతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ వెంకటరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ అనిత

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మహాలక్ష్మి

మహాసభలను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- నరసన్నపేట

అనంతపురంలో వచ్చే 13,14న నిర్వహించనున్న రాష్ట్రస్థాయి మహాసభలను విజయవంతం చేయాలని మధ్యాహ్న భోజన పథకం యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు అల్లు మహాలక్ష్మి పిలుపునిచ్చారు. ఈ మేరకు పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. వంట కార్మికులను నాలుగో తరగతి కార్మికులుగా గుర్తించి రూ.20 వేలు వేతనం ఇవ్వాలన్నారు. ప్రతినెలా 5లోగా బిల్లులు చెల్లించాలన్నారు. మెనూ ఛార్జీలు ఒక్కొక్క విద్యార్థికి కనీసం రూ.20 ఇవ్వాలన్నారు. గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చెయ్యాలన్నారు. వంటకు కావాల్సిన మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఇఎస్ఐ, పిఎఫ్, సౌకర్యం కల్పించాలన్నారు. వంట చేసేటప్పుడు ప్రమాదంలో చనిపోయిన కార్మిక కుటుంబానికి రూ.20 లక్షలు నష్టపరిహారం చెల్లించాలన్నారు. నెలకు ఒక సెలవు మంజూరు చేయాలన్నారు. పెరిగిన ధరలకు కాగుణంగా బడ్జెట్ పెంచాలన్నారు. రాజకీయ జోక్యం, అక్రమ తొలగింపులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పథకాన్ని ప్రైవేటు ఏజెన్సీలకు, కార్పొరేట్, స్వచ్ఛంద ఇవ్వాలని ఆలోచన మానుకోవాలన్నారు. కేంద్రీకృత వంటశాల ఆలోచన విరమించుకోవాలి పథకాన్ని పటిష్టంగా అమలు చేయాని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.అమరావతి, కమిటీ సభ్యులు ఎ.రాధ, ఆర్.కాంతమ్మ, కె.నాగమణి పాల్గొన్నారు.

ఎరువుల కొరత లేదు

జెసి అహ్మద్ ఫర్మాన్‌ఖాన్

ఎరువులను పరిశీలిస్తున్న జెసి అహ్మద్ ఫర్మాన్‌ఖాన్

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఈ ఏడాది ఖరీఫ్‌కు సరిపోయే ఎరువుల నిల్వలు ఉన్నాయని, రైతులందరికీ పంపిణీ చేస్తామని జాయింట్ కలెక్టర్ అహ్మద్ ఫర్మాన్‌ఖాన్ తెలిపారు. పట్టణంలోని మార్కెట్ కమిటీ యార్డు కె.మన్నయ్యపేట వద్ద ఉన్న ఎరువుల గొడౌన్లను శుక్రవారం తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఎరువుల నిల్వలను, వాటి సంబంధించిన రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే జిల్లాలోని అన్ని మండలాలకు ఎరువులను సరఫరా చేశామన్నారు. రైతు సేవా కేంద్రాల వద్ద ఎరువులను పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎరువులు పక్కదారిపపట్టడం లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, మార్క్ ఫెడ్ డిఎం రమణి, జిల్లా వ్యవసాయాధికారి త్రినాథస్వామి, ఎఒ మెట్ట మోహనరావు తహశీల్దార్ ఎస్.రాంబాబు, వ్యవసాయ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బంగారు కుటుంబాలకు వైద్యుల సహకారం

కలెక్టర్‌ను కలిసిన వైద్యులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

జిల్లాలోని బంగారు కుటుంబాలకు వైద్యులు అండగా నిలుస్తామన్నారు. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పి4 కార్యక్రమానికి తమ వంతు మద్దతు పలికారు. ఈ మేరకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను శుక్రవారం కలెక్టరేట్ వివిధ రంగాలకు చెందిన 85 మంది వైద్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలోని 2,580 బంగారు కుటుంబాలకు తాము మార్గదర్శకులుగా నిలుస్తామని వైద్యులు కలెక్టర్‌కు హామీ ఇచ్చారు. అనంతరం డాక్టర్ సనపల నర్సింహమూర్తి, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ నూర్తి కళ్యాణ్ చక్రవర్తి, డాక్టర్ భవానీ, డాక్టర్ శిరీష, డాక్టర్ అరవింద్, డాక్టర్ రేవతి, పిల్లల వైద్యుడు డాక్టర్ వినోద్, జెసిఐ, ఎపి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నుంచి డాక్టర్ మనోజ్ పాల్గొన్నారు. గైనకాలజీ సొసైటీ ప్రతినిధులు మాట్లాడుతూ 75 సోషల్ వెల్ఫేర్ సంస్థలను 12 జోన్లుగా విభజించి, కౌమార దశలో ఉన్న బాలికలకు హెల్త్ ఎడ్యుకేషన్ అందిస్తామని అన్నారు. శానిటరీ నాప్‌కిన్లు పంపిణీ చేస్తామని, ఎనీమియా నివారణ కోసం ప్రతి వారమూ ఒక హాస్టల్ చొప్పున వెళ్లి సేవలు అందిస్తామని హామీ ఇచ్చారు. శ్రీకాకుళం గ్రేటర్ పరిధిలోని 48 సచివాలయాల్లో ఎన్‌సిబి (వృద్ధాప్యంలో వచ్చే సాధారణ వ్యాధులు)తో బాధపడుతున్న వారిని గుర్తించి, వారికి వైద్యపరంగా సహాయ సహకారాలు అందించనున్నట్లు ఫిజీషియన్స్ అసోసియేషన్ ప్రకటించింది. అలాగే జెసిఐ కూడా మూడు అనాథ శరణాలయాలను దత్తత తీసుకోవాలని నిర్ణయించారు. లయన్స్ క్లబ్ హర్షవల్లి తరపున డాక్టర్ సత్యస్వరూప్ వృద్ధాశ్రమాల్లో ఉచిత నేత్ర వైద్య పరీక్షలు, కళ్లజోడు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ వైద్యుల ఈ సామాజిక సేవా తపనను అభినందిస్తూ, సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు.

కళ్లకు గంతలతో హమాలీల నిరసన

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోకు భూములిచ్చిన దళిత కార్మికుల పొట్ట కొట్టొద్దని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోను విడదీసి టెక్కలిలో మరో మద్యం డిపో ఏర్పాటుకు ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని, కార్మికుల ఉపాధి కాపాడాలని కోరుతూ ఎపి బేవరేజ్ కార్పొరేషన్ ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపో వద్ద సిఐటియు ఆధ్వర్యాన పది రోజులుగా ఆందోళన చేస్తున్న హమాలీలు శుక్రవారం కళ్లకు గంతలు కట్టుకుని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల రోజులుగా పలురూపాల్లో ఆందోళన కార్యక్రమాలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపో హమాలీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.బంగార్రాజు నాయకులు టి.రామారావు, ఎన్.సురేష్, ఎన్.రమణ, బోనెల రాము పాల్గొన్నారు.

కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న హమాలీలు

భౌగోళిక గుర్తింపుతోనే ఖాదీకి బహుళ ప్రచారం

ప్రజాశక్తి - పొందూరు

దేశంలోనే ప్రత్యేకమైన గుర్తింపు సాధించిన పొందూరు సన్న ఖాదీకి భౌగోళిక గుర్తింపు (జిఐ)తోనే బహుళ ప్రాచుర్యం లభిస్తుందని ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ (కెవిఐసి) సౌత్‌జోన్ డిప్యూటీ సిఇఒ మదన్‌కుమార్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఆంధ్ర ఫైన్ ఖాదీ కార్మిక అభివృద్ధి సంఘాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొందూరు సన్న ఖాదీ కార్మికుల కష్టానికి త్వరలోనే భౌగోళిక గుర్తింపు లభించే అవకాశం ఉందన్నారు. దేశంలో ఖాదీ పరిశ్రమ అభివృద్ధికి గతంలో రూ.పది వేల కోట్లతో పథకాన్ని రూపొందించారని, అందులో పొందూరు ఖాదీకి ప్రత్యేక కేటాయింపులు ఉన్నాయని తెలిపారు. ఆ పథకం అమల్లోకి వస్తే పొందూరు ఖాదీ దశ, దిశ మారుతుందన్నారు. కెవిఐసి పొందూరు ఎఎఫ్‌కెకె సంఘంతో కలిసి నేత, వడుకు కార్మికుల నైపుణ్యాన్ని పెంచేందుకు శిక్షణా కార్యక్రమం నిర్వహించేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఖాదీ సంఘాలకు రావాల్సి ఎన్ఎండిఎలను విడుదల చేస్తున్నట్లు తెలిపారు. పొందూరు సన్నఖాదీ వడుకు, నేత ప్రక్రియలను పరిశీలించారు. పొందూరు సంప్రదాయ సన్నఖాదీ వస్త్రాలను తిరుమలలో విక్రయించేం దుకు దుకాణం ఏర్పాటుకు అనుమతి కోసం టిటిడిని ఛైర్మన్, ఇఒలను సంప్రదించామన్నారు. సన్నఖాదీ వస్త్రాలకు ముడిసరుకైన కొండ, ఎర్రపత్తి కొనుగోలు, పంట వివరాలను సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుంటుకు కామేశ్వర ప్రసాద్, దండా వెంకటరమణ వివరించారు.

ఖాదీ వస్త్రాల తయారీ ప్రక్రియను పరిశీలిస్తున్న కెవిఐసి అధికారులు

IN THE HONOURABLE FAMILY COURT-CUM-III ADDITIONAL DISTRICT JUDGE, SRIKAKULAM.
OS NO.4 /2025.

Between:
Karimunnisa Begum and 13 others ....Plaintiffs.
And:
Mukhtar Hussain and 5 others ...Defendants

To,
D-4: Jarina Begum, W/o late Mohammad Khan,Door No.7-6-64, Pathan Gudem, Sahebula Thota, Srikakulam Town, Post and District,

Whereas Karimunnisa Begum and 13 others have instituted a suit against you and 5 others for Declaration of Title and Consequential relieves you are hereby summoned to appear in this Court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the petition or who shall be accompanied by some person able to answer all such questions, on **Dt. 12-8-2025 at 10-30 A.M,** to answer the claim; and as the day fixed for your appearance is appointed for the final disposal of the petition, you must be prepared to produce on that day all the witnesses upon whose evidence and all the documents upon which you intend to rely in support of your defence. Take notice that in default of your appearance on the day afore mentioned the suit will be heard and determined in your absence.

// Given by Order of the Honourable Court. //

SRI M. KRISHNAJEE
ADVOCATE FOR PLAINTIFFS.

అనుభూతినిచ్చిన ఎన్‌సిఎస్‌ఎల్ సదస్సు

ధ్రువపత్రం అందుకుంటున్న రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

యుఎస్ఎ బోస్టన్ నగరంలో నిర్వహించిన ఎన్‌సిఎస్‌ఎల్ సదస్సు ఎంతో అనుభూతినిచ్చిందని ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. అమెరికా పర్యటన సందర్భంగా బోస్టన్ నగరంలో జరిగిన ప్రతిష్టాత్మక 50వ ఎంసిఎస్ఎల్ సదస్సులో ఎపి తరపున ఎమ్మెల్యే పాల్గొన్నారు. శుక్రవారం బాస్టన్ స్టేట్ పార్లమెంటరీ హౌస్ వద్ద పరదేశాలకు చెందిన ప్రజాప్రతినిధులతో ఈ సదస్సుకు ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న వివిధ దేశాల ప్రతినిధులతో పాటు ఎపి నుంచి హాజరైన ఎమ్మెల్యే రవికుమార్‌కు ఎన్ఎల్‌సి ప్రెసిడెంట్ రాహుల్ కరాడ్ చేతులమీదుగా సర్టిఫికెట్‌ను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ప్రతిష్టాత్మక సదస్సులో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని, ఎన్నో కొత్త విషయాలు నేర్చుకోవడం జరిగిందన్నారు. మిగిలిన ప్రజాస్వామ్య దేశాల్లో ఆధునిక, రాజకీయ విధానాలను, అమెరికాలోని పొలిటికల్ సిస్టంను విశ్లేషించే గొప్ప వేదికగా నిలిచిందని తెలిపారు. మూడు రోజులు నిర్వహించిన ఈ సదస్సు చాలా అద్భుతంగా జరిగిందన్నారు. తన రాజకీయ జీవితంలో మరచిపోలేని అనుభూతిగా మిగులుతుందన్నారు.

గుర్రపుడెక్కను తొలగిస్తున్న ప్రొక్లెయినర్

గుర్రపుడెక్క తొలగింపు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

నరసన్నపేట: ఇటీవల 'ప్రజాశక్తి'లో 'చినుకు పడదు... నీరు రాదు' అనే కథనం ప్రచురితమైంది. దీనిపై ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి స్పందించారు. వంశధార కాలువలోని గుర్రపు డెక్కను తొలగించి రైతులకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని వంశధార అధికారులు సూచించారు. దీంతో అధికారులు స్పందించి శుక్రవారం జమ్ము కూడలిలోని 24 ఆర్ కాలువ, అదేవిధంగా కంబకాయ దగ్గర ఉన్న ఏడు ఆర్ కాలువలో దట్టంగా ఉన్న గుర్రపు డెక్కను ప్రొక్లెయినర్‌తో తొలిగించారు. దీంతో పోలాకి, నరసన్నపేట మండలంలో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెఇలు శ్యామలరావు, హరీష్, నీటి సంఘం అధ్యక్షులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం సిటీ: ప్రజా సమస్యల పరిష్కారమే తన లక్ష్యమని, ఎవరైనా నిరభ్యంతరంగా తమ సమస్యలను చెప్పాలని ఎమ్మెల్యే గొండు శంకర్ స్పష్టం చేశారు. స్థానిక విశాఖ కాలనీ పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావాలని, వెంటనే సంబంధిత అధికారులతో సంప్రదించి పరిష్కార మార్గం చూపుతామన్నారు. శ్రీకాకుళం అర్బన్, రూరల్, గార మండలాలతో పాటు పరిసర గ్రామాల ప్రజలు ఈ దర్బార్‌కు భారీ సంఖ్యలో హాజరై వినతులు సమర్పిస్తున్నారన్నారు. దర్బార్‌లో వచ్చిన సమస్యలపై అధికారులతో సమీక్షించనున్నట్లు చెప్పారు.

యశ్వంత్‌కు అండ

కవిటి: అనారోగ్యంతో బాధపడుతున్న కె.యశ్వంత్‌కు దాతలు అండగా నిలుస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే... కవిటి మండలం కుసుంపురానికి చెందిన కీలు సోమేష్, కుసుమ దంపతుల రెండేళ్ల కుమారుడు కీలు యశ్వంత్ బ్రెయిన్ ఇన్ఫెక్షన్ కారణంగా తరచూ ఫిట్స్‌తో బాధపడుతున్నాడు. చికిత్స కోసం అధిక వ్యయం అవుతుందని వైద్యులు తెలిపారు. ఈ విషయమై అదే గ్రామానికి చెందిన మాతృమూర్తి యువజనసేవా సంఘం రూ.8,500, 'మన గ్రామం-మన బాధ్యత' రూ.7 వేలు సభ్యులు స్పందించి, బాలుడి చికిత్స నిమిత్తం రూ.15,500 ఆర్థికసహాయం శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు అంగ సురేష్ కుమార్, టి.ఆశిష్, కె.భాస్కర్, టి.గోపాల్, టి.రవి, ఎ.మిన్నారావు, గ్రామస్తులు సింధుల గున్నయ్య, ఇరోతు కృష్ణ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందిస్తున్న సభ్యులు

లావేరు గోదాం ఇన్‌ఛార్జి బదిలీ

- గోదాంలో సిబ్బంది ప్రక్షాళన
- 'ప్రజాశక్తి' కథనానికి స్పందన

మండల పౌర సరఫరాల గోదాం

ప్రజాశక్తి- లావేరు

లావేరు మండల పౌర సరఫరాల గోదాం ఇన్‌ఛార్జి డిటి ప్రవీణ్‌కు టెక్కలి బదిలీ చేస్తూ వెను వెంటనే లావేరులో రిలీవై టెక్కలిలో జాయిన్ అవ్వాలని గురువారం రాత్రి బదిలీ ఉత్తర్వులు డిఎం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో ఎట్టకేలకు గోదాంలో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్న ముగ్గురు ఉద్యోగులను బదిలీ వేటు వేయడంతో గోదాం ప్రక్షాళన జరిగింది. ఇటీవల గోదాం వద్ద రేషన్ షాప్‌లకు వెళ్లే బియ్యం తూకంలో తేడాలతో భారీగా ప్రతినెలా డీలర్లు నష్టాన్ని చవిచూసేవారు. దీనిపై పలుమార్లు 'ప్రజాశక్తి'లో కథనాలు వెలువడిన విషయం పాటకులకు తెలిసిందే. ఇటీవల తూకంలో మోసాన్ని డీలర్లు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న విషయంపై బియ్యం బస్తాల్లో తరుగు పేరిట జులై 19న ప్రజాశక్తిలో కథనం రావడంతో జిల్లా అధికారులు విచారణ నిమిత్తం జులై 21న తూనికలు, కొలతల జిల్లా అసిస్టెంట్ కంట్రోలర్ వి.చిన్నమ్మను విచారణకు ఆదేశించడంతో విచారణకు వచ్చే సమయానికి గోదాం వద్ద ఉన్న కాటా ఒక్కసారిగా మరమ్మతులకు గురవ్వడంపై అనేక అనుమానాలు వ్యక్తమయ్యాయి. సిబ్బంది పనే అని పలువురు డీలర్లు బాహాటంగానే ఆరోపించారు. విచారణకు వచ్చిన అసిస్టెంట్ కంట్రోలర్ చేసేదేమి లేకపోవడంతో వెనుతిరిగి వెళ్లిపోయారు. తర్వాత మరమ్మతులు అయిన తర్వాత వచ్చి విచారణ చేస్తామని వెళ్లిపోయారు. జులై 26న టెక్నీషియన్ వచ్చి కాటాను మరమ్మతులు చేపట్టారు. ఇక్కడ గోదాం ఇన్‌ఛార్జి డిటి ప్రవీణ్, కంప్యూటర్ ఆపరేటర్ అమర్ కుమార్, సెక్యూరిటీ గార్డు కరుణాకరరావులు కుమ్మక్కై గోదాం వద్ద తూకంలో భారీగా మాయాజాలం చేయడంతో డీలర్లు ప్రతినెలా 120 నుంచి 150 కింటాళ్ల బియ్యాన్ని రేషన్ షాప్‌లకు లిఫ్టింగ్ చేసే సమయంలో నొక్కేయడంతో డీలర్లు గత మూడేళ్లుగా నష్టపోయారు. ఇక్కడ పరిస్థితిని అధికారులకు, స్థానిక ఎమ్మెల్యే ఈశ్వరరావుకు డీలర్లు ఫిర్యాదు చేశారు. గోదాం వద్ద తూకంలో మోసం, అవకతవకలపై డీలర్లు తహశీల్దార్ సమావేశంలో గోదాం వద్ద సిబ్బందిని మార్చకపోతే తాము తూకంలో నష్టాలతో డిపోలను నడపలేమని తహశీల్దార్ శ్రీనువాసరావుకు డీలర్లు తెగేసి చెప్పడం, ఇక్కడ పరిస్థితిపై ప్రజాశక్తిలో కథనం రావడం, ఆ మేరకు జిల్లా అధికారులు బదిలీ చేయడంతో ఎంఎల్ఎస్ పాయింట్‌లో ముగ్గురు ఉద్యోగులకు బదిలీ చేయడంతో ప్రక్షాళన జరగడంతో డీలర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు పొందూరు మండల సమావేశం

ఎంపిపి ఉషారాణి

పొందూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిపి కిల్లి ఉషారాణి తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి మండలంలోని ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని ఆమె పేర్కొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

తల్లిపాలపై అవగాహన

సోంపేట: మండలంలోని కొర్లాంలో శుక్రవారం ఐసిడిఎస్ పిఒ వసుంధరాదేవి ఆధ్వర్యాన తల్లిపాల వారోత్సవాల భాగంగా అవగాహనా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిపాలు తాగించడం వల్ల శిశువు కలిగే ప్రయోజనాలను వివరించారు. సూపర్‌వైజర్ మంగమ్మ, సర్పంచ్ రామ్‌బుడ్డి గణపతి, ఎఎన్ఎం నిర్మలా, సచివాలయ సెక్రటరీ వరలక్ష్మి, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు, బాలింతలు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి అందజేత

నరసన్నపేట : నరసన్నపేట టిడిపి క్యాంప్ కార్యాలయంలో జలుమూరు మండలం రావివాడకు చెందిన కింజరాపు సింహాచలం అనారోగ్యానికి గురయ్యారు. దీంతో సిఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. రూ.26,218 మంజూరు కావడంతో, సంబంధిత చెక్కును ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

11న సిజిఆర్‌ఎఫ్ క్యాంపు కోర్టు

పలాస: ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోని శ్రీకాకుళం సర్కిల్ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 11న కాశీబుగ్గ సెక్షన్ కార్యాలయంలో క్యాంపు కోర్టు నిర్వహిస్తున్నట్లు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక చైర్మన్, విశ్రాంత జడ్జి బి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు నిర్వహించనున్న క్యాంపు కోర్టులో వినియోగదారులు పాల్గొవాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు, బిల్లుల సమస్యలు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, పేరు మార్పిడి, విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో జాప్యం, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి తదితర విద్యుత్ సంబంధిత సమస్యలపై వినియోగదారులు తమ ఫిర్యాదులను నేరుగా సిజిఆర్‌ఎఫ్ కమిటీకి తెలియ జేయవచ్చున్నారు.

స్వచ్ఛ శ్రీకాకుళం లక్ష్యంగా సాగాలి

శ్రీకాకుళం సిటీ: స్వచ్ఛ శ్రీకాకుళం లక్ష్యంగా అధికారులు ముందుకు సాగాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు హర్‌గర్ తిరంగా పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగిరేలా ప్రచారం కల్పించాలన్నారు. నగరపాలక సంస్థలో ప్లాస్టిక్ నిషేదం పక్కాగా అమలు కావాలన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ పి.వి.వి.డి. ప్రసాదరావు, నగరపాలక సిబ్బంది పాల్గొన్నారు.

వ్య.కా.స నాయకుల పరామర్శ

పరామర్శిస్తున్న వ్య.కా.స నాయకులు

ప్రజాశక్తి- నరసన్నపేట

జలుమూరు మండలం టెక్కలిపాడుకు చెందిన దళిత మహిళ, ఉపాధి కూలీ దివ్వలస ఆదిలక్ష్మి గురువారం ఉదయం పెరటిలో వంట కోసం కట్టెలు తీస్తుంటే పాము కాటు వేసింది. వెంటనే కుటుంబ సభ్యులు నరసన్నపేట ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాజు సింహాచలం శుక్రవారం ఆమెను పరామర్శించారు. రెండు రోజుల క్రితం తమ పెరటి వైపు ఉన్న సాగుభూమి చుట్టూ ఉన్న గట్లు తెగగొట్టి దమ్ము చేశారని అనానరు. దీనివల్ల అక్కడ ఆవాసం కోల్పోయిన పాము తమ పెరటిలోకి వచ్చి ఉంటుందని ఆమె తెలిపారు. 30 ఏళ్ల క్రితం నిర్మించిన తమ పెరటి పునాదిని చెంచల కృష్ణమూర్తి ప్రొక్లెయినర్‌తో పెకిలించి సెంటు స్థలాన్ని తమ భూమిలో కలుపుకోవడం వలన పొలం తాలూకా నీరు తమ ఇంటి పునాదులను బలహీన పరుస్తున్నాయని అన్నారు. బుధవారం రాత్రి కృష్ణమూర్తి కుమారుడు ట్రాక్టరుతో మా స్థలంలో దమ్ము పడుతుంటే అడ్డుకున్నానని అన్నారు. ఆయన ట్రాక్టర్‌తో గుద్దేందుకు ప్రయత్నించడంతో తప్పుకున్నానని ఆమె తెలిపింది. ఏడు నెలలుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా తమ గోడు ఎవరూ పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. పరామర్శించిన వారిలో సిఐటియు జిల్లా నాయకులు ఆర్.సురేష్ బాబు, పోలాకి మండల కన్వీనర్ కాల నర్సింహులు ఉన్నారు.

అనధికార లేఅవుట్లలో ప్లాట్ల క్రమబద్ధీకరణకు అవకాశం

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘం పరిధిలో అనధికార లేఅవుట్లలో ప్లాట్ల గ్రామబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు మున్సిపల్ కమిషనర్ తమ్మినేని రవి తెలిపారు. తేదీ 30-6- 2025లోపు రిజిస్టర్ కాబడిన అనధికార లేఅవుట్లలోని ప్లాట్లు తేదీ 26- 7- 2025 నుంచి 24-10-2025 వరకు 90 రోజులలోపు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ప్లాట్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. పురపాలక సంఘ పరిధిలో అర్హత కలిగిన అనధికార లేఅవుట్ల యజమానులందరూ అనధికార లేఅవుట్లలో ప్లాట్లను కొనుగోలు చేసిన యజమానులు తమ అనధికార లేఅవుట్లు ప్లాట్ల క్రమబద్ధీకరణ కొరకు ఎల్ఆర్ఎస్ పోర్టల్ (https://dtcp.ap.gov.in/LRS) నందు నేరుగా సిటిజన్ లాగిన్ నుంచి లేదా ఆమదాలవలస పురపాలక సంఘం నందు లైసెన్సు పొందిన LTPల ద్వారా నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. క్రమబద్ధీకరణ కొరకు దరఖాస్తు చేసుకున్నవారు ఓపెన్ స్పేస్ చార్జీలపై 50 శాతం రాయితీ పొందుతారని 45 రోజుల లోపు మొత్తం ఫీజు చెల్లిస్తే పెనాల్టీ చార్జీలపై 10 శాతం తగ్గింపు 90 రోజుల్లోపు మొత్తం ఫీజు చెల్లిస్తే పెనాల్టీ చార్జీలపై ఐదు శాతం తగ్గింపును పొందవచ్చునని తెలిపారు. అంతేకాకుండా 4000 చదరపు మీటర్లలోపు విస్తీర్ణం గల వ్యక్తిగత స్థలాలు, ప్రభుత్వ రహదారి ఇప్పటికి ఉన్న రహదారి సదుపాయం కలిగి అనధికార లేఅవుట్లలో భాగం కానట్లయితే వాటిని కూడా క్రమబద్ధీకరించుకొనుటకు అవకాశం కలదన్నారు. అనధికార లేఅవుట్లు, ప్లాట్లను క్రమబద్ధీ కరించుకోని యెడల అటువంటి అనధికార లేఅవుట్లు, ప్లాట్లు నిరంతర నేరంగా పరిగణించబడతాయని, చట్టపరమైన చర్యలు తీసుకోబడునన్నారు. అనధికార లేఅవుట్లు, ప్లాట్లకు విద్యుత్, తాగునీటి సరఫరా, డ్రైనేజీ తదితర వసతులు కల్పించబడవని, భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేయబడవని, అనధికార లేఅవుట్లు, ప్లాట్లు రిజిస్ట్రేషన్ శాఖ నిషేధిత ఆస్తుల జాబితాలో నమోదు చేయబడతాయని, అమ్మకం, కొనుగోలు, ఇతర లావాదేవీలు జరపడం సాధ్యపడవని తెలిపారు. ఏమైనా సందేహాలుంటే హెల్ప్‌డెస్క్ నంబర్ 9849906976 లేదా పురపాలక సంఘ కార్యాలయ పనివేళల యందు సంప్రదించాలని కోరారు.

సాగునీటి సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో రైతాంగం కేవలం వర్షధారమే ఆధార పడి సాగు చేస్తూ... దశాబ్దాలుగా ఇబ్బందులు పడుతున్నారని రైతు కుల సంక్షేమం సంఘం కన్వీనర్ జన్నెల ప్రసాదరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎల్లమ్మ ఆలయం వద్ద శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. రైతాంగం ఎదుర్కొంటున్న సాగునీటి సమస్య పరిష్కారం సాధనకు ఇచ్ఛాపురం నుంచి జిల్లా కేంద్రం వరకు మొదట విడతగా మంత్రులకు, కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తానని అన్నారు. ఇచ్ఛాపురం బాహుదా నదిపైన ఉన్న 11 ఓపెన్ హెడ్ ఛానల్ సరైన మరమ్మతులు లేకపోవడంతో సాగు నీటి కష్టాలు పాలవుతున్నారు. ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకుని బాహుదా ఓపెన్ హెడ్ ఛానల్ మరమ్మతులు చేపట్టాలలన్నారు. కూలిన ఈదుపురం వరద గట్టు పునర్మిణం చేపట్టాలని కోరారు. కొలిగాం, కీర్తిపురం, పాయతారి గ్రామాల వద్ద ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేస్తే రైతాంగానికి ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. దీంతో పాటు వంశధార జలాలు ఇచ్ఛాపురం వరకు తెస్తే సాగు, తాగునీటి సమస్య చాలా వరకు పరిష్కారమవుతుందన్నారు. రైతాంగం సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వ విప్ అశోక్, మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గౌతు శిరీషలకు వినతిపత్రం అందించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో రైతుకుల సంక్షేమ సంఘం ప్రతినిధి టి. కూర్మారెడ్డి, దక్కత విశ్వనాథ్‌రెడ్డి, చాట్ల లోహిదాస్‌రెడ్డి, బి. మోహనరావు, బి.రఘునాథం, బర్ల ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

జాబితాను చూపిస్తున్న ప్రసాదరావు

షో లైనింగ్‌పై అవగాహన

కొత్తూరు : అవగాహన కల్పిస్తున్న రాములమ్మ

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని కలిగాంలో జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ పూజారి సత్య నారాయణ ఆదేశాల మేరకు ఎంటి సూర్యనారాయణ అలికాన రాములమ్మ రైతు వరి పొలంలో వరుస క్రమపద్ధతిలో శుక్రవారం నాటించారు. ముందుగా వరి నారు కట్లను బీజామృతంతో నారు శుద్ధి చేసి కొసలను తుంచి వరుస క్రమ పద్ధతిలో నాటించారు. దీనివల్ల కాండం తొలిచే పురుగు, దామపోటు నివారించ వచ్చునన్నారు. సూర్యరశ్మి నేరుగా భూమిని తగలడం వల్ల పిలకలు ఎక్కువగా వస్తాయన్నారు. తద్వారా దుబ్బు బాగా పెరిగి అధిక దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌ఛార్జి రాములమ్మ, రైతులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: మండలంలో ప్రకృతి వ్యవసాయ విభాగంలో భాగంగా డిపిఎం పూజారి సత్య నారాయణ ఆదేశాల మేరకు ఎచ్చెర్లలో ప్రకృతి వ్యవసాయ విభాగంలో ఐసిఆర్‌పిగా పని చేస్తున్న నేతింటి మీన పొలంలో లైన్ షోయింగ్ పద్ధతిలో వరి నాట్లను వేసుకున్నారు. లైన్ షోయింగ్ విధానం లేదా ఎద పద్ధతి అయితే డ్రమ్ సీడర్ విధానంలో సాగు చేసుకోవాలన్నారు. యూనిట్ ఇన్‌ఛార్జి సన్యాసిరావు, ఐసిఆర్‌పి రామలక్ష్మి పాల్గొన్నారు.

మెళియాపుట్టి: ప్రకృతి వ్యవసాయమే శ్రేయస్కరమని ప్రకృతి వ్యవసాయానికి ప్రతి ఒక్క రైతు మారాలని ఒడిశా గజపతి జిల్లా పర్లాకిమిడి సెంచూరియన్ అగ్రికల్చర్ విద్యార్థులు అన్నారు. వారు కొంతకాలంగా ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తూ రైతులకు ఉపయోగపడిన విషయాలు తెలియజేస్తున్నారు. అందులో భాగంగానే శుక్రవారం మండలంలోని కొసమాలలో రైతులకు మినీ కిసాన్ మేలా పేరుతో అవగాహనా సదస్సు నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం వల్ల పంటల్లో నిర్వహించే వ్యవసాయ పద్ధతులపై రైతులకు పూర్తిస్థాయి అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా, అగ్రికల్చర్ అధికారి దానకర్ణుడు, విద్యాశాఖ అధికారి దేవేందరరావు పాల్గొన్నారు.

పాలాభిషేకం చేస్తున్న నాయీబ్రాహ్మణులు

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

కోటబొమ్మాళి: నాయీబ్రాహ్మణుల సెల్యూన్ షాపులకు ఉచితంగా 200 యూనిట్లు అందజేస్తున్నట్లు ప్రభుత్వం జిఒ విడుదల చేసింది. దీంతో కోటబొమ్మాళి మండల కేంద్రంలో నాయీబ్రాహ్మణుల కమ్యూనిటీ భవనంలో జిల్లా ఉపాధ్యక్షుడు నౌగాపు నాగరాజు ఆధ్వర్యాన శుక్రవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, కింజరాపు అచ్చెన్నాయుడుల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణులు కనకరాజు, రామారావు, వీరస్వామి, వెంకటరమణ, హరినాథ్ పాల్గొన్నారు.

పోటీలకు పయనమవుతున్న క్రీడాకారులు

క్రీడాకారుల పయనం

ఇచ్ఛాపురం : సిబిఎస్ఇ క్లస్టర్-7, అండర్-17 బాస్కెట్ బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలకు జ్ఞానభారతి పాఠశాల విద్యార్థులు శుక్రవారం పయనమయ్యారు. పెద్దాపురం ప్రకాష్ సినర్జీ స్కూల్‌లో ఈ నెల 9,10,11 తేదీల్లో పోటీలు నిర్వహించనున్నారు. పాఠశాల బాస్కెట్‌బాల్ జట్టులో ఆహిల్ అక్బర్ ఖాన్, ఎ.రాహుల్, ఎం.నగేష్, పి.జగదీష్, ఎ.ఆకాశరావు, ఎన్.లక్ష్మీకాంత్, ఆదిత్యానాయక్ ఉన్నారు. పోటీల్లో పాల్గొనడానికి వెళ్తున్న విద్యార్థులను పాఠశాల కార్యదర్శి ముఖ్య కార్యనిర్వహణ అధికారి జోహార్ ఖాన్, ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ వజ్రపు రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఐ.బి.పండా, ప్రధానోపాధ్యాయురాలు రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్‌కుమార్, ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్ అలీమ్ ఖాన్, వ్యాయామ ఉపాధ్యాయులు కైలాస్ పండా, రామచంద్రారెడ్డి అభినందనలు తెలియజేశారు. క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, ఛాంపియన్‌షిప్ సాధించాలని, జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. రైల్వే స్టేషన్ వరకు వెళ్లి విద్యార్థులకు వీడ్కోలు పలికారు.

కళాకారులకు ఆర్థికసాయం

ప్రజాశక్తి- కవిటి

అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలోని గొండ్యాలపుట్టుగకు చెందిన కళాకారుడు దేవాడ ఎర్రయ్య, ఇచ్ఛాపురం మండలం బూర్జిపాడుకు చెందిన శేషగిరి ఆచారికి తోటి కళాకారులు అండగా నిలిచారు. వారి చికిత్స ఖర్చుల నిమిత్తం మహతి సాంస్కృతిక కళాసేవా సంస్థ ఆధ్వర్యాన ఇద్దరికీ కలిపి రూ.10,500 ఆర్థిక సహాయం అందజేసి మళ్లీ యధావిధిగా ప్రదర్శనలు కొనసాగించాలని సభ్యులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన సలహాదారుడు తిప్పన దాలయ్యరెడ్డి, వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి తిప్పన ధనుంజయ రెడ్డి, అధ్యక్షుడు రంగాల జానకిరామ్ రెడ్డి, ఉపాధ్యక్షుడు నర్తు గంగయ్య మాస్టర్, ప్రచార కార్యదర్శి చలపతి వినోద్ కుమార్, కోశాధికారి కొప్పల హేమంత్ పాల్గొన్నారు.

సిసి రోడ్ల పనులు ప్రారంభం

నరసన్నపేట: నరసన్నపేట పట్టణంలో మఠం వీధికి పంచాయతీ నిధులతో సిసి రోడ్డు పనులను ఉప సర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం బేసిక్ నిధుల నుంచి రూ.1.50 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణం వల్ల మార్కెట్‌లోని విశ్వభారతి స్కూల్‌కు వెళ్లేందుకు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అలాగే పాల కేంద్రానికి, బజారు వీధికి రాకపోకలు సాగించే వారికి ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శక్తి యాప్‌తో మహిళలకు రక్షణ

పొందూరు: ఆపదలో ఉన్న మహిళలకు శక్తి యాప్ ఒక రక్షణ కవచంగా పనిచేస్తుందని ఎస్ఐ ఎం.రవి అన్నారు. స్థానిక ప్రభుత్వ కళాశాల, బిసి బాలికల వసతి గృహంలో శుక్రవారం ఆమదాలవలస శక్తి టీం -2 ఆధ్వర్యంలో శక్తి యాప్‌పై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆపద సమయంలో మహిళలు ఏ విధంగా రక్షణ పొందవచ్చునని చేసి చూపించారు. అలాగే పోక్సో చట్టం, బాల్యవివాహాలు, మానవ అక్రమ రవాణాకు సంబంధించిన పలు టోల్ ఫ్రీ నెంబర్లను వివరించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ రమణమూర్తి, శక్తి టీం సభ్యులు పాల్గొన్నారు.

వృద్ధురాలి మెడలో బంగారం అపహరణ

పొందూరు: మండలం బురిడి కంచరాంకు చెందిన యారబాటి సూరప్పమ్మ అనే వృద్ధురాలి మెడలో బంగారు తాడును శుక్రవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి తెంచుకొని పారిపోయినట్లు ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు. బురిడీ కంచరాం - ఎస్.ఎం.పురం రహదారి నుంచి ధనశక్తి అమ్మవారి ఆలయానికి వెళ్లే గెడ్డ దారిలో పొలం పనులకు వృద్ధురాలు వెళ్తుంది. ఆ సమయంలో వెనకనుంచి నడుచుకుంటూ వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి ఆమె కంటిలో కారంపొడి చల్లి మెడలో ఉన్న మూడు తులాల బంగారపు తాడు తెంచుకొని పారిపోయినట్లు తెలిపారు. వృద్ధురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

లాబాంలో చోరీ

బూర్జ: మండలంలోని లాబాంలో రత్నాల సుధ ఇంట్లో గురువారం రాత్రి చోరీ జరిగినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలు సుధకు 11 రోజుల క్రితం రాజాం ఆస్పత్రిలో ఆపరేషన్ అయింది. విజయనగరం జిల్లా, సీతారాంపురంలో తన అక్క ఇంటిలో ఉండడం వలన లాబాంలోని తన ఇంటి వద్ద పెంపుడు కోళ్ల మూతకని ఆ గ్రామానికి చెందిన గేదల వరలక్ష్మికి ఇంటి తాళం ఇచ్చి వెళ్ళగా, వరలక్ష్మి రోజు రాత్రుళ్లు కోళ్ల ను మూసి తలుపు వేసికొని వెళ్లేది. ఇలావుండగా గురువారం రాత్రి వరలక్ష్మి ఎప్పటిలాగే కోళ్లు మూసి తలుపులు వేసుకొని తన ఇంటికే వెళ్లి మరల ఉదయం రత్నాల సుధ ఇంటికే వచ్చి చూడగా ఇంటి తలుపు తాళాలు పగలు గొట్టి ఉండడం చూసి ఈ విషయం సుధకు ఫోన్ చేసి చెప్పగా ఆమె వచ్చి చూడగా బీరువా తాళాలు పగలు గొట్టి అందులో ఉన్న ఒక తులం బంగారు ఆభరణాలతో పాటు రూ.5 వేలు నగదును గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు గుర్తించి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు కేసునమోదు చేసినట్లు సమాచారం.

ఎండుతున్న ఎదలు

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి డివిజన్ కేంద్రానికి కూత వేటు దూరంలోని పాతనౌపడ రెవెన్యూ గ్రామం పరిధిలో పాత నౌపడ, జండాపేట, సీతానగరం, నౌపడ రైతులు వర్షాలు లేక, వంశధార నీరు అందక వరి నారు, ఎదలు మడులు ఎండుతున్నాయి. సాగ నీరు లేక మాడిపోతున్న వరిని చూసి రైతులు గుండె బాదుకొని కన్నీరు కారుస్తున్నారు. యేటా ఖరీఫ్ సీజన్ ఆరంభంలో వంశధార నీరు కాలువలు ద్వారా పాతనౌపడ అనంత సాగరం చెరువుకు వస్తే, ఆ చెరువు నుంచి జండాపేట కొత్త చెరువుకు, బడే చెరువుకు వంశధార నీరు ప్రవహించి సుమారు 300 ఎకరాలు వరి పంటను రైతులు పండించేవారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ముగుస్తున్నా వంశధార నీరు సరఫరా చేయడంలో వంశధార అధికారులతో పాటు ప్రభుత్వ అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాగానే విత్తనాలు, దుక్కి, క్రిమి సంహారక మందులు కొరకు మదుపులు పెట్టిన రైతులకు వర్షాలు లేక, వంశధార నీరు రాకపోవడంతో తీవ్ర నిరాశకు గురై ఆందోళన చెందుతున్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పర్యవేక్షణ జరిపే వ్యవసాయశాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు సొంత నియోజకవర్గంలో లోతట్టు ప్రాంతమైన జండాపేట ప్రాంతంలో కరువు ఛాయలు నెలకొన్నా స్పందించకపోవడం రైతులు ఆందోళన చెందుతున్నారు. తక్షణమే జండాపేట, పాతనౌపడా, సీతానగరం, నౌపడ లోతట్టు ప్రాంత రైతులకు వంశధార నీరు సరఫరా అయ్యేలా మంత్రి చొరవ తీసుకొని వరి నారు మడులు, ఎద మళ్ల ఎండిపోకుండా కాపాడాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని తాళ్లవలసలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేపట్టారు. గ్రామంలో గృహ అవసరాలకు వెళ్లే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ గత మూడురోజుల క్రితం కాలిపోవడంతో గ్రామంలోని గృహాలకు విద్యుత్ లేకపోవడంతో విద్యుత్ అధికారులు సకాలంలో పట్టించుకోకపోవడంతో అనేక ఇబ్బందులు పడ్డారు. వేసవిని తలిపించే ఎండ, ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్న తరుణంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో ప్రజలు, చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. సమస్య టిడిపి రాష్ట్ర మహిళా కార్యదర్శి ముప్పిడి సుజాత, మాజీ సర్పంచ్ ముప్పిడి మురళీమోహనరావుల దృష్టికి వెళ్లడంతో వెంటనే విద్యుత్ అధికారులతో మాట్లాడి కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ని తెప్పించి యుద్ధ ప్రతిపాదికన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి వీధి లైట్లు ఏర్పాటు చేయడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ పనులు పర్యవేక్షిస్తున్న మాజీ సర్పంచ్ మురళీమోహనరావు

సెల్‌ఫోన్ కోసం స్నేహితుల మధ్య కొట్లాట

- ఒకరి పరిస్థితి విషమం
- హత్యాయత్నం కేసు నమోదు

చికిత్స పొందుతున్న దుర్గాప్రసాద్

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మండలంలోని బప్పడాం గ్రామంలో గురువారం రాత్రి సెల్‌ఫోన్ కోసం ఇద్దరు స్నేహితుల మధ్య జరిగిన కొట్లాట ఘటనలో ఒకరి పరిస్థితి విషమంగా మారింది. కత్తిపోట్లతో తీవ్రంగా గాయపడిన ఒక స్నేహితుడు ప్రస్తుతం విశాఖపట్నం కెజిహెచ్‌లో ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటనపై సరుబుజ్జిలి ఎస్ఐ బి.హైమావతి హత్యాయత్నం కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోనికి తీసుకున్నారు. శుక్రవారం ఎస్ఐ హైమావతి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నందికొండ గ్రామానికి చెందిన పల్లి వీరవెంకట దుర్గాప్రసాద్, బప్పడాంకు చెందిన పేడాడ శ్రీధర్ గత రెండేళ్ల నుంచి స్నేహితులుగా కొనసాగుతున్నారని, ఇటీవల దుర్గాప్రసాద్ సెల్‌ఫోను శ్రీధర్ తీసుకోవడం జరిగిందని, స్నేహితుడి వద్ద ఉన్న తన సెల్‌ఫోను తిరిగి ఇవ్వాలని దుర్గాప్రసాద్ అడిగాడని తెలిపారు. దీంతో అమృతలింగా నగరం వద్ద ఉన్న పాల కేంద్రం వద్దకు రావాలని శ్రీధర్ ఫోన్‌లో దుర్గాప్రసాద్‌కు చెప్పడం జరిగిందన్నారు. గురువారం రాత్రి సమయంలో దుర్గా ప్రసాద్ మరో వ్యక్తిని తీసుకొని సెల్‌ఫోన్ కోసం వెళ్లగా గ్రామంలోని తన ఇంటి వద్దకు రావాలని శ్రీధర్ కోరడంతో ముగ్గురు కలిసి బప్పడాం వెళ్లగా అక్కడ ఇరువురు మధ్య మాట మాట పెరిగి కొట్లాటకు దారి తీయడంతో దుర్గాప్రసాద్ మొఖం, రెండు చేతులు, చాతిపై శ్రీధర్ కత్తితో దాడి చేయగా తీవ్ర గాయాల పాలై పక్కనే ఉన్న పంట పొలంలో పడి పోవడం జరిగిందని ఎస్ఐ తెలిపారు. ఈ సంఘటన చూసిన దుర్గాప్రసాద్ వెనుక వచ్చిన వ్యక్తి వెంటనే పరుగులు తీసి కుటుంబ సభ్యులకు తెలుపగా గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన ఆమదాలవలస సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి. సత్యనారాయణతో పాటు ఎస్ఐ హైమావతి, పోలీస్‌సిబ్బంది గ్రామానికి చేరుకొని తీవ్రగాయాల పాలైన దుర్గాప్రసాద్‌ను 108 వాహనంలో శ్రీకాకుళం సర్వజనాస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడి వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం బాధితుడిని విశాఖపట్నం కెజిహెచ్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. నిందితుడు శ్రీధర్‌ను అదుపులోకి తీసుకొని కేసును దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హైమావతి తెలిపారు.

గుండెపోటుతో మహిళ మృతి

సోంపేట: మండలంలోని బెంకిలికి చెందిన కూన సీతమ్మ (54) గుండెపోటుకు గురై శుక్రవారం మృతి చెందింది. సీతమ్మ సమీపంలోని ఆలయంలో సేవలు చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. ఒంటరి మహిళ అయిన ఆమె తన తమ్ముడి ఇంటి వద్ద ఉంటుంది. రోజూలానే ఆలయానికి వెళ్లి వస్తుంది. మార్గంమధ్యలో స్వల్ప గుండెపోటుకు గురి కావడంతో పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని పట్టుకొని నేలపై కూలబడింది. ఆమె కేకలు విన్న కొందరు యువకులు పరిగెత్తుకుంటూ అక్కడికి వచ్చేసరికి సీతమ్మ మృతి చెందింది. తొలుత విద్యుదాఘాతానికి మృతి చెందిందని అందరూ భావించారు. సమాచారాన్ని పోలీసులకు, విద్యుత్ శాఖ అధికారులకు అందజేశారు. విద్యుత్ అధికారులు ఇది షార్ట్ సర్క్యూట్ కాదని, విద్యుత్ వైర్లు ఏవి ఆమె సమీపంలో లేవని నిర్ధారించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టు మార్టానికి తరలించారు. గుండెపోటుతో మృతి చెందింది నట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఎస్ఐ లవరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోదిస్తున్న కుటుంబ సభ్యులు

కలకాలం రక్షగా..

ప్రజాశక్తి - శ్రీకాకుళం

చెల్లీ,
ఎన్నాళ్లయినా, ఎన్నేళ్లయినా..
ఇగిరిపోని గంధం..
వసివాడని బంధం..
మన అన్నా చెల్లెళ్ల అనుబంధం...

ఇలా ఎన్ని కవితలు చెప్పినా, పాటలు పాడినా దాని అర్థం ఒక్కటే అన్నాచెల్లెల అనుబంధం. రాఖీ పండుగ అన్నాచెల్లెల అనుబంధానికి ప్రతీకగా నిర్వహిస్తుంటారు. ఈ పండగను కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ జరుపుకుంటారు. కష్టసుఖాల్లో తోడుంటానని, అన్ని వేళలా బాసటగా నిలుస్తానని అక్కాచెల్లెళ్లకు, అన్నాదమ్ములు అభయమిచ్చే పండగే రాఖీ పౌర్ణమి. జిల్లా వ్యాప్తంగా ఈ పండగను శనివారం ఘనంగా నిర్వహించుకోనున్నారు. ఏడాదిలో ఓ రోజు సోదరులను గుర్తు చేసుకోవడం చెల్లెమ్మలకు ఆనవాయితీ. మనుషుల మధ్య అంతరాలు పెరుగుతున్న నేటి తరుణంలో ఇలాంటి పండగలను అందరూ స్వాగతించాల్సిందే. చెల్లెళ్లకు అన్నల తోడు ఏడాదిలో ఒకరోజు ఉండాల్సింది కాదు. జీవితాంతం ఉండాలి. వారికి అన్నివిధాలా సహాయపడాలి. జిల్లాలో ఈ పండగను అందరూ నిర్వహించుకుంటున్నా మార్వాడీలకు ప్రధానమైంది. వీరు రాఖీ పౌర్ణమికి ఎంతో ప్రాధాన్యతనిస్తారు. ఈ పండుగకు ధనిక, పేద తారతమ్యం లేదు. దూరప్రాంతాల్లో ఉన్న మహిళలు తమ సోదరులకు పోస్టు ద్వారా రాఖీలను పంపుతారు. విదేశాల్లో ఉన్నవారు ఎస్ఎంఎస్‌ల ద్వారా, వీడియో కాలింగ్ ద్వారా రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేస్తారు. అన్నదమ్ములు పది కాలాల పాటు సుఖసంతోషాలతో వర్ధిలాలని తోబుట్టువు రాఖీ కడుతుంది. తోబుట్టువు రాఖీ కట్టినప్పుడు మనసులో ఏం కోరుకుంటే అదే జరుగుతుందనే ప్రగాఢ విశ్వాసం. ఆ విశ్వాసంతోనే రాఖీ పౌర్ణమి రోజున సోదరుల వద్దకు అక్కాచెల్లెళ్లు వెళ్తారు.

ఆకాశాన్నంటిన రాఖీల ధరలు

నగరంలోని అన్ని కూడళ్లలో రాఖీలను విక్రయిస్తున్నారు. అన్ని ధరలతో పాటు రాఖీ ధరలు కూడా పెరిగాయి. పది రూపాయలు నుంచి ఐదు వందల విలువ చేసే రాఖీలు మార్కెట్‌లో లభిస్తున్నాయి. గతేడాది రూ.30 ఉండే రాఖీ ఈ ఏడాది రూ.60 పలుకుతోంది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది వీటి ధరలు 50 శాతం పెరిగాయి. కోల్‌కతా తదితర ప్రాంతాల నుంచి రాఖీలను రప్పించి విక్రయిస్తున్నారు. స్వీట్ షాపులు జనాలతో కిటకిటలాడుతున్నాయి. రాఖీ పండుగనాడు సోదరి అన్నయ్యకు రాఖీ కట్టి మిఠాయి తినిపించడం ఆనవాయితీ. దీంతో స్వీట్ షాపులన్నీ ప్రజలతో నిండాయి.

గ్రామగ్రామాన రాఖీ స్టాల్స్

రాఖీ పౌర్ణమిని దృష్టిలో ఉంచుకొని జిల్లాలోని ప్రతిచోటా రాఖీను అమ్మే స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. కేవలం పట్టణాలకే కాకుండా ప్రతి పల్లె, గ్రామంలోనూ, చిన్నచిన్న కిరాణా దుఖానాల్లోనూ వీటిని విక్రయిస్తున్నారు.

భామినిలో కంటపడిన తెలుపు రంగు నాగుపాము

తెలుపు రంగు నాగుపాము హల్‌చల్

ప్రజాశక్తి - భామిని

స్థానిక ఎస్సీ వీధిలోని ఒక ఇంటి వద్ద తెలుపు రంగులో నాగుపాము తిరుగుతూ శుక్రవారం కనిపించింది. ఈ పాము తెలుపు రంగులు ఉండడంతో దాన్ని చూడడానికి స్థానికులు ఎగబడ్డారు. సాధారణంగా నాగు పాములు తెలుపురంగులో ఉండవు, కానీ నాగు పాములో కూడా మానవుడికి లాగే రంగుకు కారణమైన మెలనిన్ ఉంటుంది, ఇది లోపిస్తే అది తెలుపు రంగులో కనిపించడానికి అవకాశం ఉందని భామిని వెటర్నరీ డాక్టర్ మడక సంతోష్ కుమార్ తెలిపారు.

కొత్తవలసలో కార్డాన్‌సెర్చ్

సీతంపేట: మండలంలోని దోనుబాయి పోలీస్ స్టేషన్ పరిధిలో గల కొత్తవలసలో ధోనుబాయి ఎస్సై షేక్ మస్తాన్ ఆధ్వర్యంలో కార్డాన్ చర్చ్ నిర్వహించారు. గ్రామంలో చుట్టూ క్షుణంగా ఇంటింటికి వెళ్లి తనిఖీలు చేపట్టారు. నాటు తుపాకీలుంటే స్టేషన్‌కు అందించాలన్నారు. లేకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాటు తుపాకీలు ఉపయోగించకూడదని చెప్పారు. ప్రజలకు దీనిపై అవగాహన కల్పించారు. దానిలో భాగంగా సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. నాటు సారా నిర్మూలనకు మీరంతా సహకరించాలని కోరారు. ఆయనతో పాటు ఎఎస్ఐ త్రినాధరావు, తదితరులు ఉన్నారు.

విప్ అశోక్‌కు రాఖీ కడుతున్న చిన్నారులు

ముందస్తు రక్షాబంధన్

కవిటి: మన సంస్కృతి, సాంప్రదాయాలు చిన్నప్పటి నుంచే పిల్లలకు నేర్పించాల్సిన బాధ్యత ఇటు తల్లిదండ్రులు, అటు ఉపాధ్యాయులు తీసుకోవాలని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. కళ్యాణి ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు రామయ్యపుట్టుగలోని క్యాంపు కార్యాలయంలో ముందస్తు రక్షా బంధన్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విప్ అశోక్‌కు రాఖీ కట్టి మిఠాయి తినిపించారు. అనంతరం పాఠశాల ఆవరణలో రాఖీ పండుగ వేడుకలు నిర్వహించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పుష్పలత సాహు వర్ధంతి

పర్లాకిమిడి: గజపతి జిల్లా కాశీనగర్ శ్రీరామ్ డిగ్రీ కళాశాల వ్యవస్థాపకులు పుష్పలత సాహు ఆరో వర్ధంతి శుక్రవారం కళాశాల అడిటోరియంలో నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రశాంత్ బానపల్లి అధ్యక్షత పుష్పలతసాహు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఎన్‌సిసి అభ్యర్థుల ఎంపిక అధికారులు ఎన్.బి.సుబేధార్ సుఖ్, జిందర్ సింగ్, హావల్దార్ కపాల్ సింగ్ పర్యవేక్షణలో నిర్వహించారు.

చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న సిబ్బంది

దళితులపై వైసిపి కపట ప్రేమ

ప్రజాశక్తి- ఆమదాలవలస

దళితులపై కపట ప్రేమను వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ మానుకోవాలని జిల్లా ఎస్‌సి, ఎస్‌టి మోనిటరింగ్ కమిటీ సభ్యుడు తోట రాము అన్నారు. శుక్రవారం పట్టణంలో టిడిపి కార్యాలయంలో ఎస్‌సి నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని మునగవలస రేషన్‌డిపో డీలర్ మునగవలస ధనలక్ష్మిని తొలగించడంపై లేనిపోని ఆరోపణలు చేయడం చింతాడ రవికుమార్‌కు తగదన్నారు. గతంలో మునగవలస శారదా దేవి రేషన్ డీలర్‌గా పనిచేసేవారని ఆమె మరణించిన తరువాత 2014 నుంచి 2019 వరకు ఎస్‌హెచ్‌జి గ్రూపునకు చెందిన సురాన స్వాతిని రేషన్ డీలర్‌గా నియమించడం జరిగిందని తెలిపారు. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చాక అప్పటివరకు రేషన్ డీలర్‌గా పని చేస్తున్న స్వాతిని తొలగించి మునగవలస ధనలక్ష్మిని నియమించారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అక్రమంగా నియమించిన ధనలక్ష్మిని తొలగించి స్వయం సహాయక సంఘ సభ్యురాలు కె.సూర్య కుమారికి డీలర్‌గా నియమించడం జరిగిందని తెలిపారు. సూర్య కుమారిని నియమించడంపై ధనలక్ష్మి ఇప్పటికే రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించిందని, ఈ అంశం ప్రస్తుతం కోర్టులో ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అక్రమంగా రేషన్ డీలర్‌ను తొలగించారని అవగాహన రాహిత్యంతో మాట్లాడడం రవికుమార్‌కు తగదన్నారు. ఇప్పటికైనా నిజా నిజాలు తెలుసుకొని మాట్లాడాలన్నారు. సమావేశంలో మాజీ కౌన్సిలర్ గొల్లపల్లి సింహాద్రి, ఎస్‌సి సెల్, టిడిపి మండల అధ్యక్షుడు బొత్స అప్పన్న, ఎస్‌సి నాయకులు పెంకి రాజశేఖర్, నవిరి చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రాము

11 నుంచి ఎఫ్‌ఎ పరీక్షలు

ప్రజాశక్తి- టెక్కలి

ప్రభుత్వ విద్యాశాఖ ఆధ్వర్యాన సమగ్ర శిక్షా అభియాన్ పర్యవేక్షణలో ఏటా ప్రభుత్వం నిర్వహించే పరీక్షల్లో సంస్కరణలు చేపట్టింది. ఇందులో భాగంగా ఈ విద్యా సంవత్సరం నుంచి నిర్వహించనున్న పరీక్షలన్నీ కలిపి ఒకే జవాబు పుస్తక రూపంలో తీసుకొచ్చింది. సంస్కరణలో భాగంగా చేపట్టిన మార్పులతోనే ఎఫ్‌ఎ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ నెల 11న ప్రారంభం కానున్న ఎఫ్‌ఎ పరీక్షలు 14 వరకు, ప్రాథమిక పాఠశాల స్థాయి పరీక్షలు 13 వరకు, ఆరు నుంచి పదో తరగతి వరకు పరీక్షలు 14వ వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు పరీక్షల విభాగం అధికారులు ఆదేశాలు జారీ చేశారు. పరీక్షల విభాగంలో చేపట్టిన సంస్కరణల్లో భాగంగా విద్యార్థులకు అందించే జవాబుపత్ర పుస్తకాలు మండల రీసోర్స్ కేంద్రం నుంచి ఆయా పాఠశాలలకు అందిస్తారు. ఉన్నతస్థాయి తరగతుల విద్యార్థులకు 33 టైటిల్స్ ద్వారా ఈ పుస్తకాలు సరఫరా చేస్తారు. ఒక్కొక్క సబ్జెక్టుకు ఒక్కో పుస్తకం చొప్పున విద్యార్థికి అందజేస్తారు. ఈ జవాబుపత్రాలు నింపే పుస్తకంలో విద్యార్థికి సంబంధించిన పెన్ నంబరు, అపార్ ఐడి నంబరు నమోదు చేయాలి. విద్యార్థి రాసే జవాబుపత్రాలను మూల్యాంకనం చేసిన ఉపాధ్యాయుడు విద్యార్థి సంపాదించుకున్న మార్కులను పుస్తకంలోనే రూపొందించిన ఒఎంఆర్ షీటులో వేయాలి. ఒకొక్క జవాబు దిద్దిన తర్వాత ఉపాధ్యాయుడు కేటాయించే మార్కులు ఏ ప్రాతిపదికన కేటాయించారో? అన్నది వివరంగా పేర్కొవాలి. ఇవన్నీ పూర్తయిన తర్వాత విద్యాశాఖ రూపొందించిన లీప్ యాప్‌లో విద్యార్థి నమోదు ప్రకారం ఆయా జవాబుపత్రాలను స్కాన్ చేసి విద్యాశాఖ డస్క్‌కి పంపాలి. తరగతిలోని ప్రతి విద్యార్థికీ తప్పని సరిగ్గా నమోదు చేయాలి. ఇదంతా సమయంతో కూడుకున్న విధానం కావడంతో ఉపాధ్యాయులను తరగతుల కు దూరం చేస్తుండడంతో ఈ విధానాన్ని వ్యతిరేకిస్తున్నారు. నూతనంగా చేపట్టిన పరీక్షల సంస్కరణల ద్వారా విద్యాశాఖ ఏమి ఆలోచిస్తుంది... విద్యారంగం బలోపేతం చేసే క్రమంలో ఈ విధానం ద్వారా ఏమి సాధించాలనుకుంటున్నారు అనే ప్రశ్నలకు సమాధానాలు దొరకడం లేదు.